ప్రజాశక్తి
శుక్రవారం 27 సెప్టెంబర్ 2024

వరద బాధితులకు పెదపెంకి విద్యార్థుల విరాళం

ప్రజాశక్తి - పార్వతీపురం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం బలిజిపేట మండలం పెదపెంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విరాళాలు పోగు చేసి రూ.20 వేలును కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు అందజేశారు. గురువారం పెదపెంకి పాఠశాల హెచ్‌ఎం ఎం.భాస్కరరావు, ఎంఇఒ సామల సింహాచలం నేతృత్వంలో విద్యార్థులు రూ.20వేల నగదును కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వరద బాధితుల సహాయార్థం ఎంతో మంచి ఆలోచనతో విద్యార్థులు విరాళాలు సేకరించి ఇవ్వడం పట్ల కలెక్టర్ విద్యార్థులను, పాఠశాల హెచ్‌ఎంను అభినందించారు. కార్యక్రమంలో డిఇఒ జి.పగడాలమ్మ, ఎపిఒ శంకరరావు, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

అడలి వ్యూ పాయింట్

పర్యాటక హబ్‌గా సీతంపేట

- అరకు తరహాలో మారనున్న పర్యాటక ప్రాంతాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం
- పర్యాటక ఫెస్టివల్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట మన్యం అందాలు పర్యాటక ప్రేమికులకు కనువిందు చేయనున్నాయి. ఇప్పటికే సీతంపేట ఏజెన్సీ పర్యాటకానికి అనువుగా ఉండడంతో అధికారులు పెద్దపీట వేశారు. కాశ్మీర్, అరకు తరహాలో సీతంపేట మన్యం అందాలు మారనున్నాయి. ఇప్పటికే అడ్వెంచర్ పార్క్ దినదినాభివృద్ధి చెందింది. రాష్ట్ర స్థాయిలో ఈ పార్క్ గురించి పర్యాటకులకు తెలియని వారు ఉండరు. ఈనెల 27న (శుక్రవారం) ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటకులకు తగ్గట్టుగా ఇప్పటికే అధికారులు అడ్వెంచర్ పార్కును ముస్తాబు చేశారు. పర్యాటకులకు ఆకర్షణీయంగా అడ్వెంచర్ పార్క్‌లో చిన్నపిల్లలు బాలవిహార్, యువతకు జలవిహార్ ఉన్నాయి. పార్కులోకి అడుగు పెట్టగానే మనకు చిన్ననాటి బాల్యం గుర్తొస్తుంది. అక్కడ అలా ఏర్పాటు చేశారు చిన్నపిల్లల బొమ్మలు. వీటిలో టైర్ బండితో ఆట, అష్టా చెమ్మా, బర్రిపై పిల్లవాడు స్వారీ ఇలాంటి చిన్ననాటి తీపి జ్ఞాపకాలు వీటిని చూస్తే టక్కున గుర్తుకొస్తాయి. దాంతో పాటు క్లైమ్బింగ్ వాల్ సాహసోపేతమైన క్రీడ, బోటు షికార్ వంటివి పర్యాటకులకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. అంతేకాక హర్రర్ పిక్చర్‌తో భయంకరమైన శబ్దాలు మన మీద పడినట్లు 5 డి థియేటర్ నేడు పున: ప్రారంభం కానుంది. ఈ పార్కుకు కూత వేటు దూరంలో మెట్టుగూడ జలపాతం ఉంది. కొండపై నుంచి జలజల జారుతున్న జలపాతం మధ్య పర్యాటకులు జలకాలాడుతుంటారు. ఇప్పటికే పర్యాటకుల కోసం అడలి వ్యూ పాయింట్ సిద్ధం చేశారు. అడలి ఎత్తైన కొండ శిఖర ప్రాంతంలో ఈ వ్యూ పాయింట్ నిర్మించారు. మలుపుల ఘాట్ రోడ్డుపైన ఒంపు సొంపులు కొండల మధ్య తాకుతూ విహారయాత్ర చేయాలి. అడలి వ్యూపాయింట్ నుంచి చూస్తే హిర మండలం వద్ద రిజర్వాయర్, మంచుకొండలు మనకు దర్శనమిస్తాయి. పర్యాటకులు అక్కడ బస చేయడానికి టెంట్లు కూడా ఏర్పాటు చేశారు. మ్యూజియం జగత్ పల్లి రిసార్ట్ త్వరలో అందుబాటులోకి రానున్నాయి. పర్యాటక దినోత్సవం సందర్భంగా అధికారులు అడలి వ్యూపాయింట్‌ను శుక్రవారం ప్రారంభించనున్నారు. అలాగే 5డి థియేటర్ కూడా పునఃప్రారంభం కానుంది. సాయంత్రం అడ్వెంచర్ పార్క్‌లో ఫెస్టివల్ అంగరంగ వైభవంగా చేయడానికి ఇప్పటికే అడ్వెంచర్ పార్క్ ముస్తాబు కానుంది. ఇదిలా ఉండగా ఇక్కడ పర్యాటకం అభివృద్ధి చెందిన గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశాలున్నాయి. వివిధ షాపులు వెలిసి వ్యాపారాలు కూడా జోరందుకోనున్నాయి.



ప్రారంభం కానున్న 5డి థియేటర్

నేడు అడలి వ్యూ పాయింట్ ప్రారంభోత్సవం

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆడలి వ్యూ పాయింట్ ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. 27వ తేది ఉదయం 8 గంటలకు అడలి వ్యూ పాయింట్ లోని రెస్టారెంట్, నైట్ క్యాంపింగ్ టెంట్లు ప్రారంభిస్తామని తెలిపారు. వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల కోసం ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వివిధ స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాని, కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సీతంపేట ఏజెన్సీలో మరిన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాలకులకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సీతంపేట పార్క్ అభివృద్ధికి రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు పీవో తెలిపారు. ఈ కార్రక్రమానికి ఎక్కువ మంది పర్యాటకులు హాజరై వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేటి పర్యాటక దినోత్సవం కార్యక్రమాలు

8 .15: అడలి వ్యూ పాయింట్, రెస్టారెంట్, టెంటెడ్ అకామిడేషన్ ప్రారంభం
9.00 : స్టాల్స్ సందర్శన ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవం.
9.45 : సాంస్కృతిక కార్యక్రమాలు
10 15 అతిథుల ప్రసంగాలు
సాయంత్రం 4: ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ వద్ద ఐ లవ్ సీతంపేట ఫొటో పాయింట్ ప్రారంభోత్సవం
4 .20 : 5 డి థియేటర్ ప్రారంభోత్సవం
4. 45 : జబర్దస్త్ కళాకారులు, గిరిజన సంక్షేమ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు

ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు అందజేసిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సబ్‌కలెక్టర్, ఎఎస్‌పి

సదరం కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

వికలాంగులకు అవసరమైన ధ్రువపత్రాలు అందజేయడానికి జిల్లాలో సదరం శిబిరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో వికలాంగులు, ట్రాన్స్జెండర్లు, సీనియర్ సిటిజన్ల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ వికలాంగులు, ట్రాన్స్జెండర్లు, సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. వీరిని ఆర్థికంగా ఆదుకొనేందుకు పెన్షన్లు, బస్సు, రైలు పాసులు అందిస్తున్నట్లు తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో వికలాంగులు, ట్రాన్స్జెండర్లకు రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. వికలాంగులకు అవసరమైన ధ్రువపత్రాలు అందజేసేందుకు జిల్లాలో సదరం శిబిరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సీనియర్ సిటిజన్లు సామాజిక సంపద

సీనియర్ సిటిజన్లు సామాజిక సంపద అని జిల్లా కలెక్టర్ అన్నారు. సమాజానికి వారి అనుభవాలను అందించి మార్గదర్శకులుగా నిలవాలని పిలుపునిచ్చారు. అక్టోబరు 2 నుంచి నిర్వహిస్తున్న "సుందర పార్వతీపురం కార్యక్రమం"లో సీనియర్ సిటిజన్లు పాల్గొనాలని, పారిశుధ్యం, ప్లాస్టిక్ నిషేధం, తడి, పొడిచెత్త విడిగా అందజేయడం, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థులకు విజ్ఞానం అందజేయడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టరు కోరారు. ట్రాన్స్ జెండర్లు ఇంటి స్థలాలు, రేషనుకార్డులు, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరగా, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేసేలా ఒక కమిటీ నిర్మించాలని అధికారులకు కలెక్టరు సూచించారు.

ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులు అందజేత

ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులను కలెక్టర్ అందజేశారు. 49 మందికి గుర్తింపు కార్డులను అందజేశారు. వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పది మంది పట్టభద్రులు ఉన్నామని తెలియజేయగా కలెక్టర్ అభినందించారు. అనంతరం వికలాంగులు, ట్రాన్స్జెండర్లు, సీనియర్ సిటిజన్ల సంక్షేమశాఖ ఎడి కె.కవిత శాఖాపరంగా అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలు తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఎఎస్పి అంకిత సురాన మహవీర్, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యం నాయుడు, రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరామ్మూర్తి, కమిటీ సభ్యులు గణపతిరావు, ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్ జైల్‌ను సందర్శించిన జిల్లా జడ్జి సాయికల్యాణ చక్రవర్తి

సబ్ జైల్లో జడ్జి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక సబ్ జైల్‌ను విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి సాయి కల్యాణ చక్రవర్తి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో వసతులను పరిశీలించారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి పరిస్థితులు పట్ల ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. చక్కటి నడవడిక, నైతిక విలువలు వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి విజయ కల్యాణి, రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్ దామోదరరావు, పార్వతీపురం జైలు విజిటింగ్ అడ్వకేట్ టి జోగారావు, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ ఎస్ ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉద్యోగోన్నతి పొందిన పోలీసు అధికారులు ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఎస్‌పి మాధవరెడ్డి అన్నారు. ఎఎస్‌ఐలుగా పని చేస్తూ, ఎస్‌ఐలుగా ఇద్దరు ఉద్యోగోన్నతి పొందారు. ఎఆర్‌ఎస్‌ఐగా పనిచేస్తూ ఆర్‌ఎస్‌ఐగానూ, హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఎఎస్‌ఐగా ఉద్యోగోన్నతి పొందిన నలుగురు గురువారం ఎస్‌పిని మర్యాద పూర్వకంగా కలవగా, వారిని అభినందించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ ఉద్యోగోన్నతులతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. త్వరలో జిల్లాలో పని చేసేందుకు పోలీసు స్టేషనులకు బదిలీ చేస్తామని, సమర్థవంతంగా పని చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని నిర్దేశించారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి
- ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కారించాలని ఎపి రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించాలని కోరుతూ గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలురైతుల సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి అనంతరం అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభమై మూడు నెలలైందని, రైతుల వద్ద వ్యవసాయ మదుపులకు డబ్బులేక వడ్డీ వ్యాపారస్తుల వద్ద అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్నారని అన్నారు. అయితే టిడిపి ప్రభుత్వం పెట్టుబడి సహాయం కింద రైతుల అకౌంట్లో రూ.20వేలు వేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు అమలు చేయలేదని అన్నారు. తెలంగాణ మాదిరిగా రైతులకు రూ.2లక్షలు వరకు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కౌలురైతులకు భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలుకార్డులపై బ్యాంకు రుణాలు ఇవ్వాలని అన్నారు. వ్యవసాయం మోటర్లకు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దన్నారు. జిఒ 22ను రద్దు చేయాలన్నారు. ఉచిత పంట బీమాను అమలు చేయాలన్నారు. జిల్లాలో తాగునీటి ప్రాజెక్టులన్నింటికీ నిధులు కేటాయించి పూర్తి చేయాలని అన్నారు. తోటపల్లి ఎడమ కాలువ ఆధునీకరణ చేసి పాలకొండ మండలంలో 7,8 బ్రాంచ్ పరిధిలో ఆయకట్టు గ్రామాలకు తాగునీరందించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, రైతు సంఘం సీనియర్ నాయకులు కండాపు ప్రసాద్, కె.అప్పారావు, కె.జయరాం, జి.కృష్ణ, ఎం.విజయ్ కుమార్, నారాయణరావు, బుల్లిబాబు, గంగయ్య, దూసి దుర్గారావు, కాద రాము, వీరంనాయుడు, సూరయ్య, తదితరులు ఉన్నారు.

పార్వతీపురంరూరల్ : గిరిజన రైతుల సమస్యల పరిష్కరించాలని, మండలాన్ని బీడుగా మార్చే బడిదేవరకొండ మైనింగ్ లీజులు రద్దు చేయాలని స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రాము, గిరిజన సంఘం నాయకులు జి.రాము, రైతు నాయకుల సత్యనారాయణ శివం నాయుడు శంకర్రావు తదితరులు మాట్లాడారు. మండలంలోని బడి దేవరకొండ మైనింగ్ లీజు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, జంఝావతి జంగావతి ఒరిస్సా తో భూ సమస్య పరిష్కరించి మన్యం జిల్లాకి తాగునీరు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. తోటపల్లి జంగావతి సాగునీరు చివరి భూములకు అందించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహాశీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

రోడ్డు పనులకు తొలి ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించే పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ ఇంజినీరింగు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజినీరింగు అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో మంజూరైన ఇంజినీరింగు పనుల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గిరిజన, మారుమూల గ్రామాల నుంచి డోలీ మోతల్లేకుండా వారికి రహదారి సౌకర్యం కల్పించేందుకు ఇంజనీరింగు పనుల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అవసరంలేని పనులను రద్దు చేసి, అవసరమైన చోట్ల కొత్తగా ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. రోడ్డు కనెక్టివిటీ లేని గ్రామాలు, రహదారి అనుసంధానం, అసలు సిసిరోడ్డు లేని గ్రామాలు ప్రాధాన్యతా క్రమంగా పనులను చేపట్టాలని తెలిపారు. సమీక్షా సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి రవి, డివిజను, మండల ఇంజనీరింగు అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ సిక్ రూమ్ తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

హాస్టళ్లలో సిక్ రూమ్‌లు తప్పనిసరిగా ఉంచాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. గురువారం డోకిశీల గిరిజన సంక్షేమ హాస్టల్‌లో జరిగిన ఫోకల్ స్ప్రేయింగ్‌ను సందర్శించిన ఆయన ఇటీవల మలేరియాకు గురైన విద్యార్థి కార్తీక్‌కు జరిగిన చికిత్స గురించి ఆరా తీశారు. హాస్టల్‌లో సిక్ రూమ్‌కు, కిటికీలకు మెష్‌లు బిగించాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతి రోజు పిల్లల ఆరోగ్య స్థితి గతులను చూడాలని, హాస్టల్ ఎఎన్ఎం శ్రీలేఖకు సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్‌ను తనిఖీ చేశారు. మలేరియా కేసులకు అందిస్తున్న మందుల వివరాలను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ధనుంజయ కుమార్, విస్తరణాధికారి శ్రీనివాసరావు, సూపర్ వైజర్ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?

- ఆర్‌టిసి యూనియన్ రాష్ట్ర నాయకులు తులసీరాం
- తాగునీటి సమస్యపై రెండో రోజు కొసాగిన దీక్షలు
- చలో కలెక్టరేట్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యలపై ప్రభుత్వాలకు, ఉన్నతాధికారులకు చిత్తశుద్ధి ఉండాలని ఎపి ఆర్టీసీ యూనియన్ రాష్ట్ర నాయకులు తులసీరాం అన్నారు. పట్టణంలోని తాగునీటి సమస్య పరిష్కారానికై ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు రెండో రోజు గురువారం కొనసాగాయి. ఎపి ఆర్టీసీ యూనియన్ రాష్ట్ర నాయకులు తులసీరాం దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. అనంతరం చలో కలెక్టరేట్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు ప్రభుత్వాలు పరిష్కరించడంలేదంటే దాని అర్థం ప్రజలపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదనేది సత్యమని తెలిపారు. గత ప్రభుత్వం ప్రజల వద్దకు పాలనని మభ్యపెడితే, నేటి ప్రభుత్వం ప్రజలే నిర్మాతలుగా అట్టహాసం చేస్తుందని అన్నారు. మంచినీళ్లు ప్రజలకు ముఖ్యమైన అవసరమని, మున్సిపాలిటీ ఆ అవసరాన్ని అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. నిరంతరం ప్రజల నుంచి వివిధ రూపాల్లో వసూలు చేస్తున్న పన్నులను మున్సిపాలిటీ అధికారులు ఎవరి ఖాతాలో జమ చేస్తున్నారో బహిరంగ ప్రకటన ఇవ్వాలని, వెంటనే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్టోబర్ 1 చలో కలెక్టరేట్ ధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, ఐద్వా నాయకులు ఎం.గౌరీ, బి.ఉమ , ఎం. విమల, జానకి , పి.శాంతకుమారి , పార్వతీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా, ప్రజాసంఘాల నాయకులు

కోటదుర్గ హుండీ ఆదాయం రూ.1,85,222

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని కోటదుర్గ అమ్మవారి హుండిని గురువారం లెక్కించగా రూ.1,85,222 ఆదాయం వచ్చింది. మన్యం జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయ సినీయర్ సహాయకులు ఎస్.రామారావు పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వాహక అధికారి సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. ఈనెల 4 నుంచి 26 వరకు వచ్చిన ఆదాయమని అధికారులు చెప్తున్నారు.

ఆశా కార్యకర్తల గ్రీవెన్స్ నిర్వహణ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి ఆధ్వర్యంలో గురువారం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఆశా గ్రీవెన్స్ సమావేశంలో పలువురు ఆశా కార్యకర్తలు వారి వినతులను అందజేశారు. అదేవిధంగా కొంత మంది ఆశాలు మాట్లాడుతూ వృత్తిరీత్యా కొన్ని సందర్భాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. ఆశా కార్యకర్తల వినతులను లిఖిత పూర్వకంగా డిఎంహెచ్‌ఒకు సమర్పించారు. గ్రీవెన్స్ ద్వారా అందజేసిన వినతుల్లో ప్రస్తావించిన అంశాలను పరిశీలించి తగు పరిష్కారం చూపిస్తామని డిఎంహెచ్‌ఒ అన్నారు. క్రమానుగతంగా ఆశా కార్యకర్తల గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు వృత్తి రీత్యా వారు నిర్వర్తించాల్సిన కార్యకలాపాలు వివరిస్తూ క్షేత్ర స్థాయిలో ప్రజల ఆరోగ్య సమస్యలను సకాలంలో తెలుసుకోవడంలో ఆశా పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ టి.జగన్మోహనరావు, డిపిహెచ్‌ఎన్‌ఒ ఉషారాణి, డిసిఎం విజయలత, డెమో యోగీశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

డ్రోన్ ప్రయోగాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

డ్రోన్‌తో స్ప్రేయింగ్ ప్రారంభం

ప్రజశక్తి - పార్వతీపురంరూరల్

డ్రోన్‌తో పంటలకు ఎరువులు, చీడ పురుగుల నుంచి రక్షించేందుకు స్ప్రేయింగ్ చేసే చర్యలను మండలంలో చేపట్టారు. ఈ మేరకు గురువారం చాకలి బెలగాంలో వ్యవసాయ శాఖ అధికారులు, రాస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు చర్యలు చేపట్టారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా చేపట్టిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హాజరయ్యారు. జిల్లాలో డ్రోన్లను వినియోగించుకొని వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచనల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విత్తనాలు, ఎరువులను చల్లడం, చీడ పురుగుల నివారణ మందులను చల్లడం వంటి చర్యలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా ఈ చర్యలు చేపట్టడం సంతోషదాయకమని కలెక్టర్ అన్నారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకొని రైతులకు మేలు చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే శిక్షణ పొందిన డ్రోన్ పైలట్లు ఉన్నారని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చెప్పారు. వ్యవసాయ రంగానికే కాకుండా ఇతర కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం చేసి పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని సూచించారు. స్థానిక రైతుకు చెందిన 20 ఎకరాల్లో దీన్ని ప్రథమంగా చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, కెవికె సమన్వయ అధికారి ఆర్ ధ్రువ, రైతు శిక్షణా కేంద్రం ఎడి ఆర్.శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ ఎడి టి.వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి ఎం.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ గోదాం తనిఖీ
ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎ సమీపంలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ సివిల్ సప్లయ్ గోదాంను గురువారం విజిలెన్స్ సివి సింహాచలం, తూనికలు కొలతలు అసిస్టెంట్ కమిషనర్ పి.రంగారెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి రామయ్య తనిఖీ చేశారు. వేయింగ్ మిషన్ తూనిక యంత్రం క్షుణ్ణంగా పరిశీలించారు. సివిల్ సప్లయ్ నిర్వహణ గురించి తెలుసుకున్నారు. నిల్వలు సరుకుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట డిటి రమేష్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలు వైభవంగా నిర్వహించండి
ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక కోటదుర్గ అమ్మవారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని టిడిపి సీనియర్ నేత పల్లా కొండలరావు అన్నారు. గురువారం కోటదుర్గ ఆలయంలో ఉత్సవ ఏర్పాట్లను సమీక్షించారు. వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులులేకుండా చూడాలన్నారు. ప్రతిరోజు అన్నదానం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆలయ ప్రతిష్ఠను ఉత్సవాల ద్వారా పెంచాలన్నారు. ఆయనతో పాటు ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీప్రసాద్ శర్మ, రుద్రకోటేశ్వరరావు, కడగల రమణ, కిల్లారి మోహన్, ఉన్నారు.

జెజెఎంతో అందని తాగునీరు
ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందడం లేదని ఈ పథకం తీరు ఒక్క అడుగు ముందుకు మూడడుగులు వెనక్కి అన్న మాదిరిగా ఉందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మండల కేంద్రంలో జెజెఎం పథకం ద్వారా కొళాయిలు బిగించినప్పటికీ పూర్తిస్థాయిలో నీరు అందించడంలేదని అక్కడ కొళాయిలను ఆయన గురువారం పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. తక్షణమే ప్రభుత్వాలు స్పందించి జలజీవన్ మిషన్ పథకాల పనులు పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జశ్వంత్ ఎంపిక
ప్రజాశక్తి - వీరఘట్టం

జశ్వంత్

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)కు చెందిన ఎస్ జశ్వంత్ 6 కిలోమీటర్ల పరుగు పందెంలో జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ ఉమామహేశ్వరరావు తెలిపారు. అక్టోబర్ నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు ఆయన వివరించారు.

శ్రీధర్ కుటుంబానికి పుష్పశ్రీవాణి పరామర్శ
ప్రజాశక్తి - కురుపాం

కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పుష్పశ్రీవాణి

స్థానిక గౌడ వీధికి చెందిన గౌడ్ శ్రీధర్ భౌతిక దాడిలో తీవ్రంగా గాయపడి కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించిన సంగతి తెలుసుకున్న మాజీ ఉప ముఖ్య మంత్రి పాముల పుష్ప శ్రీవాణి గురువారం సాయంత్రం శ్రీధర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి. సుజాత, సర్పంచ్ జి. సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసి సంతోషి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం
ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో మున్సిపల్ పరిధిలో ఉన్న కొత్తవలసలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎలక్ట్రికల్ ఇఇ కె.గోపాల్‌రావునాయుడు గురువారం తెలిపారు. విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు తొలగింపులో భాగంగా సాయినగర్ కాలనీలో ఉన్న 11 కెవి ఫీడర్ మీద విద్యుత్ సరఫరా జరిగే విజయరామరాజు కాలనీ, కొత్త పోలమ్మ కాలనీ, మొండి వీధి, పెద్దవీధి, నవిరి కాలనీ, గిజబ కాలనీ, కొత్తవలస మెయిన్ రోడ్, మనికంట కాలనీ, సాయిరామ్‌కాలనీ ప్రాంతాల్లో విద్యుత్తుకు అంతరాయం ఉంటుందన్నారు. స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు.

మక్కువ: స్థానిక 33/11 కెవి సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఇఇ గోపాల్‌రావునాయుడు గురువారం ప్రకటనలో తెలిపారు. వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

పీసా చట్టంపై అవగాహన
ప్రజాశక్తి- సీతంపేట

న్యూఢిల్లీలో గురువారం పీసా చట్టంపై జరిగిన జాతీయ సదస్సులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫు నుంచి పార్వతీపురం మన్యం జిల్లా నుంచి సీతంపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు బిడ్డిక ఆదినారాయణ, పెద్దూరు పంచాయతీ సర్పంచ్ ఆదిలక్ష్మి, కొత్తగూడ పంచాయతీ సర్పంచ్ సుశీల పాల్గొన్నారు.

'అలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం'
ప్రజాశక్తి - మక్కువ

జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే జనసైనికులు, కూటమి నేతలు చూస్తూ ఊరుకోరని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ హెచ్చరించారు. పవన్‌పై అవాకులు చవాకులు పేలితే ముందు ముందు తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని మాజీ మంత్రి పేర్ని నానిని ఉద్దేశించి మాట్లాడారు. పవన్ కళ్యాణ్‌ని పోతు పేరంటాలు అని విమర్శించడం సరికాదన్నారు. పేర్ని నాని పవన్ కళ్యాణ్‌కి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్ జెండర్ల సమస్యలు పరిష్కరించాలి
ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ట్రాన్స్ జెండర్ల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో కురుపాం, పార్వతీపురం, పాలకొండ సబ్ డివిజన్ ల్లో సుమారు 500 మంది ట్రాన్స్ జెండర్లు వున్నారని చెప్పారు. సామాజిక భవనం నిర్మించాలని, ఒక్కరి పేరిట రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఇల్లు, స్థలాలు, పింఛను మంజూరు చేయాలని కోరారు. సిబిఒ అధ్యక్షులు ఎ.గీతారాణి, ఎ.అనుశ్రీ,బి.శతి,పి.ప్రియ కలెక్టర్‌ను కలిసిన వారిలో వున్నారు.

దహన సంస్కార ఖర్చులు అందజేత
ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

చెక్కును అందిస్తున్న కమిషనర్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తాగునీటి సరఫరాలో ఆప్కాస్ విధానంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నాన్ పిహెచ్ వర్కర్‌గా పనిచేస్తున్న ఏండ్రాపు జగన్నాథం ఆగష్టు 15వ తేదిన మృతి చెందిన విషయం తెలిసిందే. మృతి వివరాలను ఆయన కుటుంబ సభ్యులు మున్సిపల్ కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో, గురువారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ మృతిని భార్య భారతికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ జి.ఆనంద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండగ
ప్రజాశక్తి - పాలకొండ

దసరా పండగను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని డిఎస్‌పి ఎం.రాంబాబు అన్నారు. గురువారం విలేఖరులతో మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో ఎలాంటి గొడవలకు దిగొద్దని, అందరూ స్నేహపూర్వకంగా ఉండి ఉత్సవాలు జరుపుకోవాలని అన్నారు. ఎక్కడికక్కడ సిసి కెమెరాలు అమర్చామన్నారు. మద్యం తాగి తగదాలడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవాలకు ఎవరు ఎటువంటి ఇబ్బందులు పెట్టినా చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని, ఇందుకు ప్రజలంతా సహకరించాలని అన్నారు. ఆయనతో పాటు సిఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.

హామీలు నెరవేరుస్తాం : ఎమ్మెల్యే
ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం : వెంకన్నపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని ఆర్ వెంకన్నపేట గ్రామంలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజుల్లో వృద్ధాప్య వితంతువు వికలాంగుల పెన్షన్లను పెంచామని, ఈ దీపావళి నుంచి ఉచిత గ్యాస్ పథకాన్ని పంపిణీ చేస్తామని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పన కోసం ప్రయత్నిస్తున్నామని ఆయన అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాల పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సిహెచ్ భూషణ్, డిటి ఉమామహేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచులు పెంట ఉమామహేశ్వరరావు, పెంట రామకృష్ణమ్మ, నాయకులు పెంట సత్యంనాయుడు, శాల హరిగోపాల్‌రావు, కె అరవింద్ కుమార రెడ్డి, సంవత్సరాల నాయుడు, వి గొప్ప స్వామి, కె సురేష్, బొన్నాడ సత్యనారాయణ, శ్రీనివాసరావు, గొట్టాపు అప్పారావు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.25వేలు సాయం

మండలంలోని కాశాపేట గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రావు, తేలు కామేశ్వరరావు, తేలు తిరుపతి, మడక రాంబాబు, తేలు సింహాచలం, గోపాల రెడ్డి, ఎల్లం నాయుడు విజయవాడ తుపాను బాధితుల కోసం రూ. 25వేలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు గురువారం అందించారు.

కురుపాం : మండలంలోని తిత్తిరి లో గురువారం జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో చేపట్టిన ప్రగతిని వివరించి, కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎస్.వంశీ, శివకుమార్, నీలకంఠేశ్వరరావు, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చెముడు గూడ పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించడంతో పాటు కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను అందజేసి ఎన్‌డిఎ ప్రభుత్వం గత 100 రోజులుగా చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఆమె తిలకించి గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ నాగేశ్వరరావు, ఇంచార్జ్ ఎంపిడిఒ గౌరీ శంకర్రావు, ఐసిడిఎస్ సిడిపిఒ సుశీల దేవి, సర్పంచ్ ఎన్.చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి ఎం.అశోక్, టిడిపి మండల అధ్యక్షులు పాడి సుదర్శన్ రావు, ఆర్ లోవరాజు, సదానంద, శ్రీను, రామారావు, పాల్గొన్నారు.

పాలకొండ: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. పట్టణంలోని కస్పావీధిలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. గత ప్రభుత్వం పూర్తిగా అభివృద్ధిని పక్కన పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో అన్ని సమస్యలపై పరిష్కారం తీసుకుంటుందన్నారు. అదే విధంగా పట్టణం పరిశుభ్రతగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాలకొండ పట్టణంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సర్వేశ్వరరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు టంకాల దుర్గారావు, జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు, తదితరులు ఉన్నారు

సాగునీటి కాలువల్లో పూడికలు తీయాలి
ప్రజాశక్తి- పాచిపెంట

తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న రైతు సంఘం నాయకులు

పెద్దగెడ్డ జలాశయం పిల్ల కాలువలో పూడికలు వెంటనే తీసి రైతాంగానికి సాగునీరు సక్రమంగా అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఏపి రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మాదిరెడ్డి తిరుపతినాయుడు, బోను గౌరు నాయుడు అన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మాపురం భూముల్లో ఏళ్ల తరబడి సాగు చేస్తున్న రైతాంగానికి వెంటనే పట్టాల మంజూరు చేయాలని, పెద్దగడ్డ జలాశయం ఎడమ కాలువ ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి సాగునీరు అందిస్తే దాదాపు 6 పంచాయతీలకు సాగునీరు అందేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, నాసిరకం మందుల కంపెనీలపై చర్యలు చేపట్టాలని, సకాలంలో అగ్రికల్చర్ ఆఫీసు నుంచి ఎరువులు అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు పెట్టుబడి సాయం వెంటనే రూ.20వేలు అందించాలని వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు గన్నెల చిన్నారావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలోనూ మొక్కలు నాటాలి
ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బ్రోచర్‌ను ఉపాధ్యాయులకు అందిస్తున్న ఎమ్మెల్యే

బడితోట కార్యక్రమాన్ని ప్రోత్సహించి ప్రతి పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడి తోట కార్యక్రమంలో ఆమె గురువారం పాల్గొని ఉపాధ్యాయులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పంటలతో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి వీలుంటుందన్నారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు మనబడి- మన తోట పథకంలో భాగంగా మండలంలో ఉన్న అన్ని పాఠశాలలకు ఆకుకూరలు, కూరగాయలు విత్తనాలు పంపిణీ చేసి పాఠశాలలోని ఖాళీ ప్రదేశంలో విత్తనాలు నాటే కార్యక్రమం చేపట్టామని ఎంఇఒ చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బిడ్డిక భీముడు, మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, ట్రైబల్ రైట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సొంటేన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలని సిపిఎం ధర్నా
ప్రజాశక్తి -భామిని

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

భామిని ప్రధాన రహదారిపై గురువారం సిపిఎం కార్యకర్తలు కొత్తూరు నుంచి బత్తిలి వరకు గల రోడ్డును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి బాగు చేయాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మిన్నారావు మాట్లాడుతూ మండలంలో కొత్తూరు నుండి బత్తిలి వరకు ప్రధాన రహదారి, గోతులతో నుండి అస్తవ్యస్థంగా, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితిలో లేరని అన్నారు. కొత్తూరు నుంచి బత్తిలి వరకు సుమారు 30 కిలోమీటర్లు పరిధి ఉన్న ఈ రోడ్డును బాగు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని తెలిపారు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా అధికారులకు కనిపించడం లేదానని విమర్శించారు. వారం రోజుల్లో రోడ్డు మరమ్మతులు చేపట్టి రోడ్డును బాగు చేయాలని, లేనిపక్షంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపడతామని హెచ్చరించారు. రోడ్డుపై ధర్నా చేపట్టడంతో వాహన రాకపోకలు కాసేపు నిలిచిపోయాయి. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జగన్నాయుకులు,కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయ పాఠాలు
ప్రజాశక్తి - పాచిపెంట

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎఒ తిరుపతిరావు

చిన్నప్పటి నుంచే విద్యార్థులు వ్యవసాయ పాఠాలు నేర్చుకోవాలని, నేలల స్వభావం, మట్టి పరీక్షలు, పంటలు పండించే విధానాలపై అవగాహన ఉండాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని సరాయివలస గురుకుల బాలికల కాలేజీలో విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మట్టి పరీక్షలపై అవగాహన కల్పించి, 50 మట్టి నమూనాలను తీయించి విశ్లేషణకు పంపించాలని, అలాగే కాలేజీకి మట్టి నమూనా విశ్లేషణ సాధనాలు కూడా పంపించబడతాయని, దీనిపై విద్యార్థుల అవగాహన చేసుకుని మట్టి నమూనాలను తీయాలని తెలిపారు. ఎకరాకు ఐదు, ఆరు చోట్ల వి ఆకారపు 15 సెంటీమీటర్ల గొయ్యి తవ్వి అంచులు వెంబడి మట్టిని తీసుకుని నీడలో ఆరబెట్టి మెత్తగా తయారుచేసి క్వాడ్రింట్ పద్ధతిలో అర కిలో మెత్తటి మట్టిని తీసుకుని మట్టి పరీక్షలు చేసి ఎరువులు వేసే విధానాన్ని మట్టి పరీక్ష ఫలితాలకు అనుగుణంగా ఉండేలా చేయడమే దీని లక్ష్యమని తెలిపారు. ప్రిన్సిపల్ దేవేందర్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతి వ్యవసాయం, భూమి ఆరోగ్యం వంటి వాటిపై అవగాహన ఉండాలని, కళాశాల ప్రాంగణంలో కూరగాయలు పండించాలని సరిపడా స్థలం కూడా ఉందని, కావున విద్యార్థులు పెరటి తోటల పెంపకాన్ని ఒక అలవాటుగా చేసుకోవాలని ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలని బాగా చదువుకొని ఆంగ్లంలో కమ్యూనికేషన్ అభివృద్ధి చేసుకోవాలని కోరారు. అనంతరం సమీప పొలాల్లో విద్యార్థులతో మట్టి నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో విఎఎలు సాయి, గణేష్, ప్రకృతి సేద్య ఐసిఆర్‌పి సుకరమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన
ప్రజాశక్తి - గరుగుబిల్లి

సీతానగరం: చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

మండలంలోని ఉల్లిభద్ర జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం ఎస్ఐ రమేష్‌నాయుడు ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి, అలాగే పోస్కో కేసుల గురించి ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ క్రైమ్ నివారణ చర్యలు గురించి వివరించారు. మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణా చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సీతానగరం: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని ఆర్.వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విధిగా పౌష్టికాహారం తీసుకోవాలి
ప్రజాశక్తి -గరుగుబిల్లి

గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి అన్నారు. సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పెదగుడబ గ్రామంలో అంగన్వాడీ వర్కర్లు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార నిర్వహణపై మహిళా, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహార లోపానికి గురికాకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు చింతాడ గౌరమ్మ, పాల్గొన్నారు.

పరుగు పందెంలో సత్తా చాటిన విద్యార్థులు
ప్రజాశక్తి -వీరఘట్టం

పతకాలు సాధించిన విద్యార్థులు

శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్స్ గేమ్స్ సెలక్షన్ పోటీల్లో వీరఘట్టం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర)కు చెందిన పి.సంజన, ఎస్.నందకిషోర్ మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. అక్టోబర్‌లో ఆర్ట్స్ కళాశాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు వ్యాయమ ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు మూడు కిలోమీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం సాధించడంతో ప్రధానోపాధ్యాయులు బి.సుంబోర, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

రోడ్డు గొయ్యిలో దిగబడ్డ బస్సు, లారీ
ప్రజాశక్తి -భామిని

రోడ్డుపై ఇరుక్కుపోయిన బస్సు, లారీ

భామిని ప్రధాన కూడలి సమీపాన ప్రధాన రహదారిలో ఏర్పడిన గొయ్యిలో ఎదురెదురుగా వస్తున్న బస్సు, లారీలు దిగబడ్డాయి. బస్సు లారీ దిగబడి ఒకవైపు ఒరిగిపోవడంతో వాహన రాకపోకలకు కాసేపు అంతరాయం కలిగింది. కొత్తూరు నుంచి బత్తిలి వరకు ప్రధాన రహదారి గోతులతో అస్తవ్యస్తంగా ఉన్న గత పాలకులు పట్టించుకోలేదు. ప్రస్తుత పాలకులు కనీసం చూడడం లేదని ప్రయాణికులు గుసగుసలాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్తూరు నుంచి బత్తిలి వరకు ప్రధాన రహదారి గోతులను కప్పి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హెచ్‌ఎంతో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

వ్యతిరేక విధానాలపై యుటిఎఫ్ పోరాటం
ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై యుటిఎఫ్ నిరంతరం పోరాడుతుందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం పైడి రాజు అన్నారు. గురువారం మండలంలోని తలవరం, బిటవాడ, నీలానగరం, పనస నందివాడ, మొట్ట వెంకటాపురం, కుమ్మరి గుంట బొడ్లపాడు, పాపంపేట, డెప్పివలస అడారు తదితర గ్రామ పాఠశాలలు పర్యటించి యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న స్వర్ణోత్సవంలో ఉపాధ్యాయులు పాల్గొవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు బి దుర్గాప్రసాద్, కే గోవింద రావు, గౌరవ అధ్యక్షులు ఏ స్వామి బాబు, సహాధ్యక్షులు జేవి సూర్య ప్రకాష్, కార్యవర్గ సభ్యులు ఎం ముకుందర, బి రమేష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆజూరులో పౌష్టికాహార మాసోత్సవాలు
ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలస సెక్టార్ ఆజూరు అంగన్వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఒ బి.అనంతలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా పాలు, గుడ్లుతో పాటు ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలని, పౌష్టికాహార అవశ్యకతను పిల్లలు మొదటి వెయ్యి రోజుల సంరక్షణ చిరుధాన్యాలపైన, వ్యక్తిగత పరిశుభ్రత పైన అవగాహన కల్పించారు. అలాగే పోషకాహారం ప్రదర్శన, గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, ఉపాధ్యాయులు చిరంజీవి, అంగన్వాడి సూపర్వైజర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టంలో స్వర్ణాంధ్ర విజన్
ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం స్వర్ణాంధ్ర-2047 విజన్ కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర విజన్ 2047 కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇఒ ఎం రవి, సచివాలయాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చెరువులో పడి మహిళ మృతి
ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మృతి చెందిన అన్నపూర్ణ

చెరువులో పడి మహిళ మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం పార్వతీపురం మున్సిపాలిటీ వివేకానంద కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన మానేపల్లి అన్నపూర్ణ (40) పార్వతీపురం శివారులో గల అగ్రహారం చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడటంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న ఆమె అక్క కుమారుడు చక్రధర్ ఫిర్యాదు మేరకు పార్వతీపురం రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతిపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త రెండేళ్ల క్రితం చనిపోవడంతో ఆమె స్థానిక ఒక కోవెలలో పని చేస్తూ జీవనం సాగిస్తుంది.

కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి
ప్రజాశక్తి - సాలూరు

స్వచ్ఛతా హీ సేవ పదో రోజు కార్యక్రమంలో భాగంగా సాలూరు మున్సిపల్ సిబ్బంది సాలూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులు పేర్కొన్నారు. పట్టణంలో వార్డులను సిబ్బంది శుభ్రపరిచారు. రోడ్డు పక్కన ఉన్న చెత్తను ట్రాక్టర్‌లో తరలించారు. అధికారులు, సిబ్బంది అందరు సహకారం అందిస్తున్నారని చెప్పారు.